
31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
మంగళవారం 30 జూన్ 2026 పేజీలు : 8

## పేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తుంది

◆జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 29 : పేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహాలు పూర్తి కాగా సోమవారం గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జగిత్యాల పట్టణంలోని 18వ వార్డు బుర్ర మాధవి వేణుగౌడ్, 16వ వార్డు గువ్వ శాన్వి శ్రీనివాస్ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు హాజరై గృహప్రవేశం చేయించి,శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేశారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలం

2లో





## మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

◆రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

◆జగిత్యాలలో నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి

చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 29: మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్" కార్యక్రమాన్ని రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించి, నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని, వారు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాలను నిలబెట్టేలా ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. "ఒక్కసారి మాత్రమే తీసుకుంటే ఏమవుతుంది" అనే నిర్లక్ష్య ధోరణి జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని, డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమని మంత్రి హెచ్చరించారు. అందువల్ల ప్రతి యువకుడు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కళాశాలలు, విద్యాసంస్థలు లేదా పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించాలని మంత్రి సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. అనుకోకుండా మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాంటి వారు సంకోచించకుండా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకుని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని పేర్కొంటూ, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి యువకుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖకు తెలియజేసి సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న నషా ముక్త్ -2లో

## సర్‌లో అర్హుల ఓట్లు తొలగకుండా అప్రమత్తంగా ఉండాలి

◆కేసీఆర్ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

◆బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 29 : సర్‌లో అర్హుల ఓట్లు తొలగకుండా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, కేసీఆర్ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ సర్‌లో గతంలో ఓటర్లు ఉన్నారా లేదా అని మాత్రమే పరిశీలించేవారని, ఇప్పుడు 2002ను ప్రాతిపదికగా తీసుకోవడంతో ప్రజల్లో గందరగోళం నెలకొందన్నారు. 2002లో ఓటు లేని వారి తల్లిదండ్రుల ఓట్లను పరిశీలిస్తారని, ముఖ్యంగా ఆడబిడ్డల తల్లిదండ్రుల ఓట్లపై దృష్టి పెట్టాలని సూచించారు. పట్టణంలో ఉపాధి నిమిత్తం వలస వచ్చి స్థిరపడిన వారి ఓట్లు తొలగే ప్రమాదం ఉందని, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలవాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతంతోనే భవిష్యత్ ముడిపడి ఉందని, రాబోయే శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్‌ను గెలిపించుకోవాలని కోరారు. కేసీఆర్ హయాంలో పది జిల్లాలను 33 జిల్లాలుగా విభజించి, ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని, బీసీ, మైనారిటీ గురుకులాలు పెట్టి బలహీన వర్గాలకు అండగా నిలిచారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 30 నెలల్లో కొత్తగా ఒక్క పాఠశాల కూడా పెట్టలేదని, యంగ్ ఇండియా పాఠశాలలు పేరుకు మాత్రమేనని విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే కేంద్రీయ విద్యాలయానికి స్థలం గుర్తించలేకపోతున్నారని, 10 ఏళ్ళు బీఆర్ఎస్‌లో అధికారం అనుభవించి పదవి కోసం కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. జగిత్యాలలో ప్రస్తుతం జరుగుతున్న పనులన్నీ కేటీఆర్ మంజూరు చేసిన నిధులేనని, స్థానిక కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకుండా ఎమ్మెల్యే బినామీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. అనంతరం మాజీ జడ్పీ చైర్పర్సన్ దావా వసంత సురేష్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలు పార్టీని కాపాడిన 2లో

## విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్



◆ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఈఎంఆర్ఎస్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ తనిఖీ

చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట, జూన్ 29 : నిత్యం విధి నిర్వహణలో బిజీ బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విద్యార్థులకు బోధన చేస్తున్న తీరును వారితో కలిసి కూర్చుని పరిశీలిస్తూ.. పాఠ్యాంశం విన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ 2లో

## పేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తుంది



**మొదటి పేజీ తరువాయి...**అంతర్గాం గ్రామానికి చెందిన బొర్రగల్ల సుస్మిత శ్రీనివాస్,జాబితాపూర్ గ్రామానికి చెందిన ఎగోలపు హేమలత రాజు గృహ ప్రవేశాల్లో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ మాట్లాడుతూ జగిత్యానియోజకవర్గంలో ఇప్పటికే వందలాది ఇందిరమ్మ ఇళ్లు మంజూరై గృహప్రవేశాలు జరుగుతు న్నాయని, మిగిలిన అర్హులకు కూడా దశలవారీగా ఇళ్లుమంజూరు చేస్తామనిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, సమీండ్ల శ్రీనివాస్,నక్కల రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు కూతురు శేఖర్,దుమల రాజ్ కుమార్,గంగారం,నాగుల శ్రీనివాస్,నోముల శేఖర్ రెడ్డి, అంకం సతీష్ రాజా గౌడ్ తదితర ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్



**మొదటి పేజీ తరువాయి...**స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎకనామిక్స్ పాఠ్యాంశం ఉపాధ్యాయుడు బోధిస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో కలిసి బెంచి పై కూర్చున్నారు. పాఠ్యాంశం బోధనను స్వయంగా పరిశీలించారు. పూర్తి అయిన తర్వాత దానిపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం డైనింగ్ హాల్ కు వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా.. ముందుగా మెనూ పరిశీలించి.. సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం ప్రతి రోజు భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదవాలని, ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి. చదువులో రాణించి.. తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. లైబ్రరీ లో పుస్తకాలతోపాటు దిన పత్రికలు చదవాలని తెలిపారు. దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు. పరిశీలనలో ప్రిన్సిపాల్ ఫాతిమా, ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్‌లో అర్హుల ఓట్లు తొలగకుండా అప్రమత్తంగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి...**



జీవన్ రెడ్డికి కాంగ్రెస్ మానసిక వేదన మిగిల్చిందన్నారు. ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, పట్టణ అధ్యక్షుడు ఆయిల్నేని వెంకటేశ్వర్ రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా, కౌన్సిలర్లు శివ కేసరి బాబు, కోరుకంటి రాము, ప్రదీప్, సామల జమున రాజశేఖర్, తోపరపు లావణ్య రజనీకాంత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్మపురి పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి

**-ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి**



**చురకలు విలేకరి, ధర్మపురి, జూన్ 29 :** ధర్మపురి పట్టణ సమగ్ర అభివృద్ధికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారం తో కృషి చేస్తామని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ అన్నారు. ధర్మపురి అభివృద్ధి భాగంగా సోమవారం 13వ వార్డులో నూతన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహాయ సహకారాలతో ధర్మపురి పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రతి వార్డులో అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. 13వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు కూడా మెరుగుపడను న్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఇందారపు రామన్న ,కౌన్సిలర్లు సంఘనబట్ల సంతోషి, చిపిరిశెట్టి రాజేష్ , ఓజ్జల లక్ష్మణ్ ,సంగి ఆనంద్ ,మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ కె. షౌకత్ ,ప్రజాప్రతినిధులు, అధికారులు, వార్డు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏళ్ళు గడిచినా కనీస వసతుల్లేని వెల్గటూర్ మార్కెట్ యార్డు

**-అద్దె ఇంటిలో కార్యాలయం , శాశ్వత రోడ్డులేని చందం**
**-97 లక్షల నిధులు మంజూరై నెలలు గడిచినా టెండర్ ప్రక్రియ పూర్తికాని వైనం**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మే 29 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోవ్యవసాయ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేసి ఏళ్ళుగడిచినా గోదాములు నిర్మించడం తప్ప పూర్తి స్థాయి కనీస వసతులు ఏర్పాటు చేయక పోవడంతో స్థానిక రైతులకు ఎలాంటి ఉపయోగం లేదనే ఆరోపణలున్నాయి. వెల్గటూర్ పెద్దవాగు సమీప ప్రభుత్వ భూమిలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్ యార్డ్ కు వెళ్లేందుకు వాగుపక్కనుండి మట్టి దారి ఏర్పాటు చేశారు. శాశ్వత రహదారి నిర్మాణం చేపట్టక పోవడంతో మార్కెట్ యార్డ్ కు వెళ్లడం ఇబ్బంది కరంగా మారింది. ఊరికి కొంత దూరంగా ఉండడం,శాశ్వత రోడ్డునిర్మాణం చేపట్టకపోవడం,మార్కెట్ యార్డులో ప్లాట్ ఫాం, షెడ్,కార్యాలయం, విద్యుద్దీకరణ,తదితర కనీస వసతులు లేక పోవడంతో రైతులదాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదు. యేళ్ల తరబడి మార్కెట్ యార్డ్ లో వసతులు లేకపోవడంతో ఏఎంసి కార్యాలయం అద్దె ఇంటిలో నిర్వహిస్తున్నారు. మార్కెట్ కమిటీ పాలక వర్గాలు మారుతున్నా, మార్కెట్ యార్డ్ మాత్రం అభివృద్ధికి నోచుకోవడంలేదు. ప్రస్తుతం 97లక్షల నిధులు షెడ్,ప్లాట్ ఫాం,విధ్యుద్దీకరణ కోసం మంజూరి అయినప్పటికీ నెలలు గడిచినా టెండర్ ప్రక్రియ పూర్తికాక పోవడం శోచనీయం. గతంలోకూడా ఒకసారి నిధులు మంజూరయ్యి టెండర్ల ప్రక్రియకు నోచుకోక పనులు జరుగని పరిస్థితి. మార్కెట్ యార్డ్ ఏర్పాటై ఏళ్ళు గడిచినా,ప్రభుత్వాలు,పాలక వర్గాలు మారినా కనీస వసతులకు నోచుకోక, రైతులకు ఉపయోగ పడకుండా పేరుకే మార్కెట్‌యార్డ్ అన్నచందంగా పరిస్థితి నెలకొంది. మార్కెట్ ఆర్థిక లావాదేవీల పరిస్థితి ఏంటో,పాలకవర్గాలు ఏం చేస్తున్నాయో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతి నిధులు,అధికారులు వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను పూర్తి స్తాయిలో అన్ని వసతుల ఏర్పాటుతో పాటు అభివృద్ధి చేసి రైతులకు ఉపయోగపడే విదంగా చర్యలు చేపట్టాలని పలువురుకోరుతున్నారు.

# మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి....**భారత్ వంటి అవగాహన కార్యక్రమాలు యువతలో చైతన్యం పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. యువత దేశానికి విలువైన ఆస్తి అని, వారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల స్నేహితులు, వారి ప్రవర్తన, అలవాట్లపై నిరంతరం దృష్టి ఉంచి వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు “నో” చెప్పి, ఇతరులను కూడా చైతన్యవంతులను చేయాలని, సమాజంలో మత్తు రహిత వాతావరణం ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం వివిధ శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. యువత, ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల దుష్పరిణామాలను తెలుసుకుని వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా వైద్య చికిత్స, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. డ్రగ్స్ సరఫరా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా ఉంచి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరి ప్రలోభాలకు లోనుకాకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, ప్రజలు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందిస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్తు పదార్థాలపై సమాచారాన్ని గోప్యంగా అందించిన వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని పేర్కొంటూ, మత్తు రహిత జగిత్యాల -- మత్తు రహిత తెలంగాణ లక్ష్య సాధనకు ప్రతి పౌరుడు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు, అధికారులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 29 :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి 98 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 197 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేస్తామని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్, రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.




# బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 29 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసు కుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు.ప్రతి సోమ వారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు.బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## 7వ వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్లు, కల్వర్ట నిర్మాణం చేపట్టాలని వినతి



**చురకలు ప్రతినిధి కోరుట్ల జూన్ 29 :** రాష్ట్ర వెలమ కార్పొ రేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్‌రావు మెట్‌పల్లి పట్టణ 7వవార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అబ్దుల్ జాకీర్ వినతిపత్రం సమర్పించారు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని 7వ వార్డులోని హనుమాన్ నగర్, ఇస్లాంపుర ప్రాంతాల్లో డ్రైనేజీ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగు నీరు నిల్వ ఉండి,దోమలకు ఆవాసంగా మారి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.అదేవిధంగా,హనుమాన్ నగర్, ఇస్లాంపుర ప్రాంతాల్లో సీసీరోడ్లు దెబ్బతినడంతో ఆమార్గంలో ప్రయాణించే వాహనదారులు, మహిళలు,చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.గత రెండు సంవత్సరాలుగా జువ్వాడి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్ట నిర్మాణాలు చేపట్టినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో పనులు అసంపూర్తిగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున 7వ వార్డులో డ్రైనేజీలు, కల్వర్టు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని అబ్దుల్ జాకీర్ జువ్వాడి నర్సింగ్ రావును కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో యూనిఫాంల పంపిణీ



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూన్ 29 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రం3లో చిన్నారులకు సోమవారం ప్రభుత్వం అందజేసిన యూనిఫామ్ దుస్తుల ను గ్రామ సర్పంచ్ బండమీది కవిత పంపిణిచేశారు.రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రిఅడ్లూరి లక్ష్మణ్ కుమార్ అంగన్ వాడి కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిసారించారని, దీనిలో భాగంగా నిధుల కేటాయింపు తో పాటు, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు అద్ది ఆకర్షణీయ పెయింటింగ్స్, విధ్యుద్దీకరణ పనులను పూర్తి చేయించినట్లు జి పి పాలక వర్గ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం మొదటిసారిగా అంగన్వాడి చిన్నారులకు యూనిఫారాలను అందజేయడంహర్షనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుండాటి సందీప్ రెడ్డి, నక్క సురేష్, గుమ్మల లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ శంకరమ్మ,సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లాలో దారుణం

**-భార్యను హత్య చేసి.. భర్త బలవన్మరణం**





**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 29 :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి గ్రామంలో సోమవారం దారుణం చోటుచేసుకుంది. నూకపల్లి గ్రామానికి చెందిన గోలెపు నాగరాజు అతని భార్య లక్ష్మి (30)ని ఉరివేసి హత్య చేశాడు.అనంతరం నాగరాజు (35)ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నప్పటికీ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.సోమవారం ఉదయం స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మల్యాల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలాన్ని మల్యాల సిఐ మాదాసు రాజ్ కుమార్, ఎస్ఐలు సందర్శించి శవ పంచనామ నిర్వహించారు.అనంతరం హత్య, ఆత్మహత్య కేసుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విధుల్లో చేరిన ప్రీ ప్రైమరీ తరగతుల ఇన్స్ట్రక్టర్లు, ఆయాలు

**-మండల విద్యాధికారి బండారి మధు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూన్ (29) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో విద్యా సంవత్సరానికి ప్రీ ప్రైమరీ తరగతుల కోసం ఇన్స్ట్రక్టర్లు ,ఆయాలు విధుల్లో చేరినట్లు ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారి బండారి మదు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ తరగతులకు అనుమతి పొందినటువంటి మండలంలోని నాలుగు పాఠశాలలో ఇన్స్ట్రక్టర్లు,ఆయాలు జిల్లా విద్యాధికారి ఆదేశాలతో విధుల్లో చేరడం జరిగిందని,రెగ్యులర్ తరగతులకు బోధించినటువంటి పద్ధతుల్లో కాకుండా ఆటలు పాటలతో నేర్చుకునే విధంగా ఇన్స్ట్రక్టర్లు విద్యార్థులకు ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తారని మండల విద్యాధికారి పేర్కొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన జువ్వడి కృష్ణారావు



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జున్ (29) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని యామపుర్ గ్రామంలో సర్పంచ్ కనక నాగేష్ తండ్రి కనుక హన్మాండ్లు ఇటీవల మృతిచెందగా, ఈరోజు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామంలో సర్పంచ్ నగేష్ ను,ఇబ్రహింపట్నం మండల కేంద్రం లో నల్ల రమేష్ ను ,ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయనవెంట ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, క్యాతం తిరుపతిరెడ్డి,మెర్తడి గంగారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్ఏలు

# కార్యకర్తలతో అవగాహన సమావేశం

**-జోగిన్‌పల్లి, పైడిమడుగు గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్ఏలు కార్యకర్తలతో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అవగాహన సమావేశం**



**చురకలు ప్రతినిధి కోరుట్ల జూన్ 29 :** కోరుట్ల మండలం జోగిన్‌పల్లి, పైడిమడుగు గ్రామాల్లో నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ)లు పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బూత్ స్థాయిలో ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలన, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి అవసరమైన సమాచారం అందిస్తూ సహకరించాలని బీఎల్ఏలకు సూచించారు. బూత్ స్థాయి కార్యకర్తలు పార్టీకి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ప్రతి ఇంటికి చేరుకుని ఓటరు జాబితా ప్రక్రియపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడైన పౌరుడికి తన ఓటు హక్కు సక్రమంగా ఉండేలా చూడటం అందరి బాధ్యత అని అన్నారు. అలాగే త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుందని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పాల్గొని పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, గ్రామ గ్రామాన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు హాజరైన ఎమ్మెల్యే



**చురకలు విలేకరి,బీర్‌పూర్, జూన్ 29 :** బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరయ్యారు.బీర్పూర్ గ్రామానికి చెందిన కలమడుగు సంధ్యారాణి-రాకేష్, నరసింహులపల్లె గ్రామానికి చెందినశైలజ-శ్రీనివాస్ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు హాజరై గృహప్రవేశం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. లబ్ధిదారురాళ్లకు చీర కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన చీర్నేని బుచ్చన్నను పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీర్పూర్ మండలం రేకులపల్లి గ్రామంలో నల్లపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు డప్పు చప్పుళ్లతో, నృత్యాలతో స్వాగతం పలికి గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పాక్స్ చైర్మన్ నవీన్ రావు, బీర్పూర్ సర్పంచ్ హరీష్, సర్పంచ్‌లు సృజన సుశీన్, శేఖర్, మాజీ సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ సత్తెమ్మ, మండల సర్పంచ్‌లు రంగు లక్ష్మణ్, రాజ్ కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ నారాపక రమేష్, వార్డు సభ్యులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యకు పెద్దపీట.. ఎండపల్లి పాఠశాలలో విద్యార్థుల చేరికలు

**చురకలు విలేకరి ఎండపల్లి, జూన్ 29 :** ఎండపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నూతన విద్యార్థుల ప్రవేశోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య, ఆధునిక బోధనా విధానాలు, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని



పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వార్డు సభ్యులు దొనకొండ శోభ, దాసరి మల్లేశం, రేగుంట అంజయ్య, సంపతి స్వామి తమ పిల్లలను ఎండపల్లి ప్రాథమిక పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ విద్యపై తమ విశ్వాసాన్ని చాటారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాశెట్టి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సంక్షేమ పథకాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు.అలాగే, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులను ప్రతిరోజూ ఆటోలో పాఠశాలకు తీసుకువచ్చి తిరిగి ఇళ్లకు చేర్చేందుకు ముందుకు వచ్చిన ఐదో తరగతి విద్యార్థిని దాసరి అనుశ్రీ తండ్రి దాసరి మల్లేశంను మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దాశెట్టి రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు దొనకొండ శోభ, దాసరి మల్లేశం, రేగుంట అంజయ్య, సంపతి స్వామి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభం



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జున్ (29) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రీ ప్రైమరీ తరగతుల ను ఇబ్రహింపట్నం మండల విద్యాధికారి బండారి మధు ప్రారంభించారు. అనతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ప్రీ ప్రైమరీ తరగతుల కొరకు ప్రత్యేకంగా పరిశీలకులు పిల్లల అవసరాలను చూసుకోవడానికి ఆయాను నియమించిందన్నారు. ఈ విద్యార్థులకు ప్రత్యేక కుర్చీలు, ఫర్నిచర్, చార్ట్స్ వివిధ రకాల బొమ్మలు కూడా సమకూర్చుతుందని,గ్రామంలోని తల్లిదండ్రులు ప్రీ ప్రైమరీ చదివే విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో పాఠశాలకు పంపాలని ఎంఇఓ సుచించారు.ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి,ఒడ్డెర కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రదీప్, సిఆర్పి రవీందర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శివాలయాలలో ఏరువాక పౌర్ణమి వేడుకలు

**-శివయ్యకు పంచామృత అభిషేకాలు**
**-ప్రత్యేక అలంకరణలో స్వామి వారు,అమ్మవారు**





**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జున్ (29) :** ఏరువాక పౌర్ణమి సందర్భంగా సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది.భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానలు ఆచరించి సమీపంలోని శివాలయాలలో స్వామివారికి పంచామృత అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పుజలు నిర్వహించారు.జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్,తిమ్మాపూర్,తిమ్మాపూర్ తండా, యమాపూర్,పక్కిర్ కొండాపూర్, వేములకుర్తి,బర్తిపూర్,ములరాంపూర్ ,ఎర్దండి,కోమటి కొండాపూర్,వర్ష కొండ,కోజకొత్తూరు, కేశపూర్,డబ్బా, అమ్మక పేట్,ఇబ్రహీంపట్నం గ్రామాలలో శివాలయాలలో పంచామృత అభిషేకాలు అనతరం ప్రత్యేక అలంకరణ కార్యక్రమం జరిగింది.వర్షాలు సమృద్ధిగా కురిసి కరువు రాకుండా చూడాలని స్వామి వారిని భక్తులు వేడుకున్నారు.అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేసి భక్తులకు ప్రత్యేక హారతులు ఇచ్చి ఆశీర్వచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన జువ్వాడి



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూన్ (29) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్, ఫకిర్ కొండాపూర్, యమాపూర్ గ్రామాలలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు పరిశీలించారు. బిఎల్వోలకు పలు సూచనలు అందించారు. అనంతరం పల్స్ పోలియో రెండో రోజు సందర్భంగా పలువురికి డ్రాప్స్ వేశారు.ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు బండి రాజేష్,తోట రమేష్,మార్కెట్ చైర్మన్ భోరిగాం రాజు, వైస్ చైర్మన్ ఏలాల వెంకటరెడ్డి,మాజీ ఎంపీపీ నెరెళ్ళ దేవేందర్ ,గడ్డం శంకర్ రెడ్డి,క్యాతం తిరుపతిరెడ్డి,బోరిగాం మహేష్, సింగని మారుతి, ఎలేటి జనార్ధన్, మోర్తాడ్ గంగారెడ్డి బిఎల్వోలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎగువ మానేరు ప్రాజెక్టును జీవనాధార ప్రాజెక్టుగా గుర్తించాలి

**-తక్షణమే పూడిక మట్టిని తీపించి,కోతకు గురైన ఆఫ్రాన్‌తో పాటు కుడి,ఎడమ కాలువలకు మరమ్మత్తులు చేపట్టాలి**

**-మానేరు పరిరక్షణ కమిటీ డిమాండ్**

**-సోమవారం ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ను కలసి వినతి పత్రం సమర్పణ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూన్ 29 :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో గల ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి లో ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ కమిటీ కన్వీనర్ గుంటి వేణు ఆధ్వర్యం లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కన్వీనర్ గుంటి వేణు కో కన్వీనర్ మజార్ చాకలి రవి మార్వాడి సుదర్శన్‌లు మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థాన్ ఏడవ నిజాం నవాబు 2.2 టీఎంసీల నీటిసామర్థ్యంతో సుమారు రెండు కోట్ల యాభై లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించారు. ఈ ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులకు జీవనాధారంగా మారింది. ప్రధానంగా పాల్వంచ వాగు కూడా వెల్లి వాగు వరద నీటితో ఈ ప్రాజెక్టు నిండుతుంది కాలక్రమేనా పర్యవేక్షణ లోపంతో 76సంవత్సరాలు గా నీటితోపాటు వచ్చి చేరినమట్టి పూడికతో ప్రాజెక్టు సామర్థ్యం క్రమక్రమే నా తగ్గి 1.4టీఎంసీలకు చేరిందని అలాగే గతంలో వచ్చిన వరద కారణం గా 100మీటర్ల ప్రాజెక్ట్ లైనింగ్ ఆఫ్రాన్ దెబ్బతిందని,కుడి,ఎడమ కాలువలను సుమారు 73కిలోమీటర్ల మేర జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలచే శుభ్ర పరిచి అవసరం ఉన్నచోట మరమ్మత్తులు చేపట్టాల్సిన అవసరం ఉందని,3.8కిలోమీటర్ల ప్రాజెక్ట్ ఆనకట్ట కు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేప ట్టాలని ప్రాజెక్ట్ 33షటర్లకు మరమ్మత్తు లు చేయాలని, ప్రాజెక్ట్‌లో పూడిక తీసిన ఒండ్రు మట్టిని పరివాహక ప్రాంత రైతులకు ఉచితంగా పంపిణీ చేయాలని అలాగే మానేరు ప్రాజెక్టు పరిరక్షణ కమిటీని ప్రభుత్వం అధికారికంగా గుర్తించి వారి విధులను ప్రకటించాలని కోరుతూ ఎగువ మానేరు మానేరు తీర ప్రాంత రైతుల సంక్షేమం కోసం ఎగువ మానేరు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు కోకన్వీనర్ బుస్స వేణు, బండారి బాల్రెడ్డి ధ్యాప దేవయ్య,కుసుమ విష్ణు,చెన్నమనేని పురుషోత్తమారావు, పంతం రవి,మీసం లక్ష్మణ్ మల్లారెడ్డిపేట నవీన్ బైండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు వినతి పత్రం సమర్పించినట్లుగా తెలిపారు.

# 37 ఏళ్ల సింగరేణి సేవకు ఘన వీడ్కోలు

**-మార్త వీరన్న - లక్ష్మీ దంపతుల పదవీ విరమణ**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 29 :** రామగిరి మండలం సెంటినరీ కాలనీ ఆర్జీ 3 పరిధిలో పనిచేసి పదవీ విరమణ చేసిన మార్త వీరన్న కు తోటి కార్మికులు ఉద్యోగులు ఘన సన్మానం చేశారు. సింగరేణి సంస్థలో 37 సంవత్సరాల పాటు నిబద్ధతతో సేవలందించిన ఆర్ జి త్రీ ఏ పి ఏ ఎంవీటీసీ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్, హెడ్ ఓవర్‌మెన్ మార్త వీరన్న- లక్ష్మీ దంపతుల పదవీ విరమణ సన్మాన సభ సోమవారం సెంటినరీ కాలనీలోని శ్రీసాయిరాం గార్డెన్స్‌లో అత్యంత ఘనంగా జరిగింది. మూడున్నర దశాబ్దాలుగా గనిలో పలు రకాల వృత్తిలో,మైనింగ్ సూపర్‌వైజర్‌గా, అనంతరం గనుల వృత్తి శిక్షణ విభాగంలో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా వందలాది మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి విశిష్ట సేవలు అందించిన వీరన్న ని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమానికి వి టిసి,ఏఎల్‌పి, ఓసిపి 1,ఓసిపి టు,అర్జీత్రిజి ఎం కార్యాలయ సిబ్బంది,అధికారులు,స్థానిక సి2 క్వార్టర్స్ నివాసితులు,హన్మకొండ స్నేహబృందం,క్లాస్‌మేట్స్, సింగరేణి బ్యాచ్‌మేట్స్,పద్మశాలి సంఘ సభ్యులు కుటుంబ సమేతంగా హాజరై దంపతుల ను శాలువాలు,బహుమతులు, వస్త్రాల తో ఘనంగా సత్కరించారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక సారయ్య సంఘ సభ్యులతో కలిసి దంపతులను చేనేత కండువాతో సత్కరించి, కుల దైవమైన శ్రీ మార్కండేయ స్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి వంగ రాజ సమ్మయ్య వేదికపై వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ అతిథులను పరిచయం చేసి, వీరన్న గారితో వారికున్న అనుబంధాన్ని పంచుకుంటూ సభను ఆహ్లాదభరితం చేశారు. వీరన్న- లక్ష్మీ దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విశ్రాంత జీవితాన్ని గడపాలని హాజరైన వారంతా ఆకాంక్షించారు.

### ఉద్యమకారుల ఇంటి స్థలాల కోసం జరిగే

# భూ పోరాటాన్ని విజయవంతం చేద్దాం

**-టిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల జిల్లా ఇంచార్జ్ మజీద్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ భోగే పద్మ**




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూన్ 29 :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇన్చార్జ్ మజీద్, ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ భోగి పద్మ సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం జులై 2న జరిగే హైదరాబాద్లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలోని స్థలాన్ని ఉద్యమకారులకు భూ పంపిణీ చేయాలని టిఆర్ఎస్ అధినేత కల్వ కుంట్ల కవితక్క చేపడుతున్న భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు భూమి పంపిణీ చేయాలనే ధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం మజీద్, పద్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ఉద్యమంలో 1200మంది ప్రాణ త్యాగాలు చేయడం జరిగిందన్నారు. ఆ కుటుంబాలు తెలంగాణ రాష్ట్రం సాధించినా కూడా బిఆర్ఎస్,కాంగ్రెస్ ప్రభుత్వాలు హామీలు ఇచ్చి ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో వీధిన పడ్డాయన్నారు. ఉద్యమంలో ఎంతో మందిఉద్యమకారులు జైలుకు వెళ్లి మానసికంగా,శారీరకంగా,ఆర్థికంగా చితికిపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాకముందు ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చి ఆదుకుంటామని హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా కూడా ఒక్క హామీ అమలు చేయలేద న్నారు. జులై 2న ఉద్యమకారులందరూ తమ హక్కుల భాగమైన ఇంటి స్థలం పొందుట కోసం పార్టీలకు అతీతంగా ఉద్యమకారులు,మద్దతుదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రక్షణ సేన నాయకులు కదిరే భాస్కర్ గౌడ్,జావీద్, రేణుక,లాస్య,అక్కపల్లి భూపతి,లాల్ మహమ్మద్,సాలెంద్రీ నవీన్,కోడి ముంజ బాబు, బైరి రాజేష్, బండి శ్రీహరి, మోహన్ రెడ్డి, అనూష, లహరి, అజీజ్, తోట కనకయ్య, చామనపల్లి చంద్రశేఖర్, అవదుర్తి శ్రవణ్, సయ్యద్ రజక్, దేవా, అనసూర్య, అంతగిరి సంపత్, దుస్స రవీందర్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

## ఘనంగా వటసావిత్రి పూర్ణిమ వేడుకలు

**- సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించిన మహిళలు**




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 29 :** ప్రతి సంవత్సరం నిజ జ్యేష్ట మాసం శుక్ల పక్షం రోజున శుద్ధ పౌర్ణమి తిథి సందర్భంగా సోమవారం మంథని పట్టణంలోని అన్ని వీధులలో వటసావిత్రి పౌర్ణిమి వేడుకలు మహిళలు ఘనంగా, సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ పండుగ రోజున మహిళలు విష్ణుమూర్తి అవతారమైన మర్రిచెట్టును భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. జేష్ట నక్షత్రంతో చంద్రునితో కూడి ఉండే పర్వదినమును జేష్ఠ పూర్ణిమగా అభివర్ణిస్తారు. సీత యజ్ఞం పేరుతో ఈ పండుగ జరుపుకునే ఆచారం ఉండేదని విష్ణు పురాణంలో వెల్లడించబడింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఈ పర్వదినం రోజున ఎడ్లు, నాగలి, ఇతర వ్యవసాయ పనిముట్లను పూజిస్తారు. మర్రి చెట్టుకు 108 దారంతో చుట్టి అలంకరించి పూజిస్తారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ పౌర్ణమి రోజున పద్మ పురాణ గ్రంథం దానం చేయడం వల్ల అశ్వమేధ యాగ చేసిన ఫలితం దక్కుతుందని శాస్త్రాల్లో వెల్లడించబడింది.

## మున్నూరు కాపు పటేల్ సంఘ భవనం ప్రారంభోత్సవం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 29 :** ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామంలో మున్నూరు కాపుపటేల్ సంఘం నూతన భవనాన్న మాజీ జెడ్పిటిసి సభ్యులు చీటీ లక్ష్మణరావు,మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు బొబ్బ దేవయ్య హరిదాస్ నగర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఉప్పుల చిన్నరాజంసర్పంచ్ సిర్రం నాగరాజుయాదవ్‌లు పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. సంఘం భవనానికి సంఘం స్వంతంగా 9లక్షల రూపాయలు స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ 5 లక్షల రూపాయలు మంజూరు చేశారని మొత్తం 14లక్షలతో సంఘ భవనాన్ని నిర్మించుకోవడం జరిగిందని సంఘం అధ్యక్షులు ఉప్పుల చిన రాజం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మున్నూరు కాపు పటేల్ సంఘం అధ్యక్షులు మేడిశెట్టి శ్రీనివాస్,రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రచార కార్యదర్శి బండారి బాల్ రెడ్డి సంఘం ప్రతినిధులు నంది కిషన్ మీసం రాజం బోనాల సాయిలను సంఘం ప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఉప్పుల రవి మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉప్పుల మల్లేశం నాగరాజు మాజీ సింగల్ విండో డైరెక్టర్ జంగిడి సత్తయ్య శీలం అనిల్ కుమార్ శేఖర్ నారాయణ రాములు సత్తయ్య రవి శ్రీనివాస్ రమేష్ పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## షేర్ అలిబాబా ఉర్స్ ఉత్సవాలకు సీపీకి ఆహ్వానం



**చురకలు ప్రతినిధి, కరీంనగర్,జూన్ 29 :** జూలై 2వ తేదీన నిర్వహించే హజరత్ షేర్ అలీ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలకు రావాలని కరీంనగర్ పోలీసు కమిష నర్ గౌష్ ఆలంను కలిసి, దర్గా కమిటీ బాధ్యులు సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈమేరకు జిల్లా పోలీసు కమిషనరేట్ లో సీపీకి పూల బొకేను అందించి, మర్యాద పూర్వకంగా కలిసి, దర్గాలో నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, దర్గా కమిటీ అధ్యక్షుడు వాజిద్ అలీ, సభ్యులు ఆయూబ్ ఖాన్, మూసా తదితరులు సీపీని కలిసిన వారిలో ఉన్నారు.

# పల్లె పల్లెన ఊరు వాడ ఏకం చేసేలా పండగలు జరుపుకుందాం

**-దండోరా జెండా ఎత్తి తల ఎత్తి తిరుగుదాం**
**-ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 29 :** గంభీరావుపేట్ మండలం నాగంపేట్ గ్రామంలో కుల బాంధవుల తోటి యువకులతోటి గౌరవ పద్మశ్రీ గౌరవ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా ఇన్చార్జి పుట్ట రవి మాదిగ పర్యవేక్షణలో నాగం పేట గ్రామంలో గో టు విలేజి 40 డేస్ కార్యక్రమంలో భాగంగా జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరపాలని అవగాహన కల్పించడం జరిగింది. 30 సంవత్సరాల పోరాటం చేసి వర్గీకరణ సాధించడం జరిగింది ఈ ఫలాలను అందుకోవాలంటే మన బిడ్డలను మంచిగా చదివి చావాలి దీనికి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలి తెలియజేయడం జరిగింది. ఎవరు కూడాచదువు మీద అశ్రద్ధ చేయద్దని తెలియజేస్తున్నాంవర్గీకరణ ఫలాలను మీరు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని మీ కుటుంబాలను పేరు నిలబెట్టాలని విద్యఉద్యోగ ఆర్థిక రాజకీయ ఫలాలను పొందుకొని బాగుపడాలని తెలియజేస్తున్నాం. అంబేద్కర్ సంఘం మరియు కుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అధ్యక్షులు ఖానాపురం లక్ష్మణ్ మాదిగను కాలువ తోటి సామానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కత్తుల బాబు మాదిగ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గద్దల గణేష్ మా మల్లారపు మహేష్ మాదిగ ఏర్పుల శేఖర్ మాదిగ మల్లారపు దేవయ్య మాదిగ మల్లారం బాలయ్య మాదిరి కొంగర సతీష్ మాదిగ రంగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణ

**-పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**
**-గోదావరిఖని పోలీస్ స్టేషన్ సందర్శన**




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 29 :** శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిర్విరామంగా కృషి చేస్తున్నారని,ప్రజల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పెద్దపెల్లి డీసీపీ రామ్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం గోదావరిఖని పోలీస్ స్టేషన్ను పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో అధికారులు,సిబ్బంది పనితీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో పెండింగ్ కేసుల వివరాలను స్థానిక పోలీస్ అధికారుల నుండి సేకరించారు. నేరాల నియంత్రణకు స్థానికంగా తీసుకుంటున్న జాగ్రత్తలను తెలుసుకోవడంతో పాటు డిసిపి స్థానిక పోలీస్ అధికారులకు ప్రత్యేకమైన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్కి వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు మర్యాదగా బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. ఈ సందర్భంగా డిసిపి రామ్రెడ్డి మాట్లాడుతూ ప్రతి డివిజన్ పోలీస్ ఆఫీసర్ తన పరిధిలో నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. యువత, పెద్దలు, ప్రజాప్రతినిధులతో కలిసి స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ముఖ్యమైన వైటల్ ఇన్స్టాలేషన్లు,ఆసుపత్రులు, దేవాలయాలు,పెద్ద అపార్ట్మెంట్లు, వాణిజ్య సముదాయాలు తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. యువతను గంజాయి, మాదకద్రవ్యాలు, ఆన్లైన్ బెట్టింగ్,లోన్ యాప్ మోసాలు వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచేలా అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాల వైపు మళ్లించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. పోలీస్ స్టేషన్ సందర్శనకు వచ్చిన పెద్దపల్లి డిసిపి రామ్రెడ్డికి గోదావరిఖని ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ అఫ్జలుద్దీన్, ఎస్ఐలు రమేష్,మనోహర్, అనూష పాల్గొన్నారు.

## అదనపు ఉపాధ్యాయులను కేటాయించండి



**చురకలు ప్రతినిధి కమాన్పూర్ జూన్ 29 :** రామగిరి మండలం కల్వచర్ల ఎంపిపిఎస్ పాఠశాలకు అదనంగా ఉపాధ్యాయులను కేటాయించాలని జిల్లా విద్యార్థి గారికి గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి సోమవారం వినతి పత్రం అందజేశారు. కల్వచర్ల గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలలో ప్రస్తుతం 110మంది విద్యార్థులు చదువుతున్నారు ఇంకా విద్యార్థులు రావడానికి సిద్ధంగా ఉన్నారని,అదనపు ఉపాధ్యాయులను వెంటనే నియమించి మరియు తరగతి గది కట్టివ్వాలని కోరుతూ కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి మరియు హెచ్ ఎం ఆకుల శ్రీనివాస్ జిల్లా విద్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ , విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయులను త్వరితగతిన కేటాయించాలని అధికారులను కోరారు. గ్రామంలోని విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రోడ్డ విజయ్ పాల్గొన్నారు.

## ఓమౌ జయః ఆశ్రమంలో
# ఘనంగా శ్రీ పరబ్రహ్మ యజ్ఞం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 29 :** ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురం గ్రామ శివారులోని ఓమౌజయః ఆశ్రమంలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ పరబ్రహ్మ యజ్ఞం ఘనంగా జరిగింది. ప్రత్యక్ష కరుణామయులు ప్రత్యక్ష ప్రేమ మయులు శ్రీ శ్రీ శ్రీ పరమ పూజ్య మహా ప్రేమవతార స్వయంభూ సద్గురు పరబ్రహ్మ శ్రీ జై మహావిబో శ్రీవారి దివ్యానుగ్రహంతో ప్రతినెల 4వ ఆదివారం రోజున ఉదయం 9 గంటల నుంచి 10:30గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ఓమౌ జయః ఆశ్రమాన్ని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సందర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారికి నిర్వాహకులు అన్న ప్రసాదం వితరణ చేశారు. యజ్ఞంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నంది కిషన్ జర్నలిస్టులు బండారి బాల్రెడ్డి పెంటం శ్రీనివాస్ పందిళ్ళ రవికాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచిన యువకుడు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 29 :** ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ హ్యూమన్ రైట్స్అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బైరిభాస్కర్ సోమవారం అశ్విని హాస్పిటల్లో ఒకరికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావలసి ఉండగా హ్యూమన్ రైట్స్ చీఫ్ సెక్రటేరి భాస్కర్ వెంటనే స్పందించి సకాలంలో రక్త ధనం చేసిపలువురికి ఆదర్శంగా నిలిచారు. ఎలాంటి ఆపాద సమయంలో అయినా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన హ్యూమన్ రైట్స్ టీమ్ ఏళ్లవేళలో సహకారం చేస్తోందని భాస్కర్ తెలిపారు.

## పలువురిని పరామర్శించిన “కొండూరి”



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 29 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అశ్విని హాస్పిటల్లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సముద్ర లింగాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లాగౌడును ఎల్లారెడ్డిపేటకు చెందిన సద్ది రాజిరెడ్డిని బెస్త దేవయ్యలను బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను పలువురిని నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య సోమవారం పరామర్శించి మనో ధైర్యం కల్పించారు. వారి వెంట మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు చాంద్ పాషా తదితరులున్నారు.

## రైతుల సౌకర్యార్థం సహకార విశ్రాంతి భవనం నిర్మించాలి

**చురకలు ప్రతినిధి,మంథని,జూన్ 29 :** మంథని మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్నటువంటి సహకార సంఘానికి సంబంధించిన స్థలాన్ని రైతుల సౌకర్యార్థం విశ్రాంతి భవనం నిర్మాణం చేయాలని మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన బెల్లంకొండ రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భూమి విషయమై ఎవరు కబ్జా చేయకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, కేడీసీసీ బ్యాంక్ కరీంనగర్, పెద్దపల్లి, మంథని బ్రాంచీల వారికి ఆయన వినతి పత్రం సమర్పించారు. ఖాళీగా ఉన్న ప్రదేశాన్ని ఏ వర్గానికి కేటాయించకుండా రైతుల కోసం వినియోగించాలని ఆయన కోరారు. గతంలో ఖాళీగా ఉన్న ప్రదేశానికి బ్యాంకులో చేనేత సహకారం సంఘం వారు కొంత మొత్తం రుణం తీసుకున్నారు. ఆ బాకీ కి సంబంధించిన సభ్యులు రుణాన్ని విస్మరించడం వల్ల సహకార సంఘం బ్యాంక్ వారు స్వాదినం చేసుకొని గత 20 సంవత్సరాలుగా బ్యాంకు కార్యాలపాలు నిర్వహించారు. అక్కడి నుండి బ్యాంకు వేరే ప్రదేశానికి మార్చినందున ప్రస్తుతం ఖాళీ ప్రదేశాన్ని రైతుల సౌకర్యార్థం సహకార విశ్రాంతి భవనం నిర్మాణం, విత్తనాల నిల్వ కేంద్రంగా మార్చగలరని ఆయన వినతి పత్రంలో కోరారు.

## వాహనాల తనిఖీ

**-లైసెన్స్ హెల్మెట్స్ లేని వారికి జరిమానాలు**
**-ఎస్సై 2సయ్యద్ అబ్దుల్లా రజాక్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 29 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం లో సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారిలో శనివారం ఎల్లారెడ్డిపేట ఎస్సై టు సయ్యద్ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 15వాహనాలకు లైసెన్స్ హెల్మెట్ లేని వారికి జరిమానా విధించడం జరిగిందని ముగ్గురు మద్యం తాగిన వారిని పట్టుకోవడం జరిగిందని ఎస్సై తెలిపారు.

# నూతన బోర్‌వెల్‌ను ప్రారంభించిన జువ్వాడి నర్సింగ్‌రావు





**చురకలు ప్రతినిధి కోరుట్ల జూన్ 29 :** కోరుట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్ బాయ్స్)లో విద్యార్థుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నూతన బోర్‌వెల్‌ను తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన, విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జువ్వాడి నర్సింగ్ రావు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం కోసం కచ్చితంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత – గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్, వార్డ్ కౌన్సిలర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధి కొరకై కాంగ్రెస్ పార్టీలో చేరిక

**-నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇల్లుతో నెరవేరింది**

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు విలేకరి, రాయికల్, జూన్ 29 :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విశ్వాసం వ్యక్తం చేసిన స్థానిక సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం రాయికల్ మండల వడ్డెర కాలని సర్పంచ్ బోదాసు చంద్ర శేఖర్,వడ్డే లింగాపూర్ సర్పంచ్ బండారి మానస సాయి, రామారావు పల్లె సర్పంచ్ కోటే రాజేందర్,కురమపల్లి సర్పంచ్ మ్యాకల మల్లేష్ లు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ సమక్షంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజేంగి నందయ్య కండువా వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని అమలు చేస్తున్న పథకాలు ప్రజల విశ్వాసాన్ని పొందాయని అన్నారు. గ్రామాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలతో ప్రజల్లో కాంగ్రెస్‌పై ఆదరణ రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు.దేశంలో అత్యధిక వరి మొక్కజొన్న కొనుగోలు చేసి రైతుల పక్షాన అండగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.శాంతి యుతంగా కలిసి ఉండి,ప్రజా సేవే లక్ష్యం గా అందరం కలసి పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు.పేదల సొంతింటి కల సాకారం చేయటం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ అని అన్నారు.విద్య,వైద్యం వ్యవసాయంకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు జగిత్యాలకు అత్యధిక 14పల్లె దవాఖాన లు మంజూరు చేసినట్టు తెలిపారు.రాయికల్ మండలంలో నూతనంగా మంజూరైన అంగన్వాడీ భవనాలు త్వరిత గతిన పూర్తి చేయాలి అన్నారు.అనంతరం రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామం లో బర్ల సరిత కిరణ్ ,మిట్టపల్లి సుజాత గంగాధర్, రాజనగర్ గ్రామంలో బలుసు మధుశ్రీ రంజిత్ ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం హాజరై ఇండ్లు పరారంభించారు.రాజానగర్‌లో 5లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం ,యూనిఫామ్,నాణ్యమైన బోధన అంది స్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్,టిపిసిసి సెక్రటరీ బండ శంకర్,ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి,పాక్స్ చైర్మెన్‌లు ధీటి రాజిరెడ్డి ఏనుగు మల్లారెడ్డి,రాజలింగం, సర్పంచ్‌లు రాజేష్,గౌతమి వెంకటేష్, స్వామి,ప్రసాద్,రామస్వామి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు, నాయకులు కోల శ్రీనివాస్, మోకిద్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా వెంకటేశ్వర్లు నియామకం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూన్ 29 :** సిరిసిల్ల స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా వెంకటేశ్వర్లు సోమవారం నియమకయ్యారు.రాష్ట్రవ్యాప్తంగా 36 మంది డిఎస్పిలకుడిజిపి సీవీ ఆనంద్ పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

# బిఎల్ ఏలు సర్ పై అప్రమత్తంగా ఉండాలి

**-కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్**

**-రంగాపూర్లో సర్ ప్రక్రియ పరిశీలించిన ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 29 :** స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ కార్యక్రమం పై బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని,అర్హులైన ప్రతి ఓటరు పేరులిస్టులో ఉండేలా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ సూచించారు.సోమవారం హుజురాబాద్ మండలం రంగాపూర్లో జరుగుతున్న "సర్" సర్వేలో కో ఆర్డినేటర్లతో కలిసి ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బూత్ లలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని, బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇచ్చే దరఖాస్తుల ను పత్రాలను జాగ్రత్తగా నింపాలని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు పోకుండా జాగ్రత్త వహించాలని కోరారు. కొత్త ఓట్ల నమోదు ప్రక్రియలో అవగాహన కల్పించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. లిస్టులోలేని ఓటర్లను చేర్పించాలని, కొత్త ఓటర్లను వారి కుటుంబ సభ్యుల తో మ్యాపింగ్ చేయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్ కో ఆర్డినేటర్లు, మండల అధ్యక్షుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు,గ్రామ శాఖ కో ఆర్డినేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పరామర్శ



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూన్ (29) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో భిఆర్ఎస్ కార్యకర్త మాలేపు లక్ష్మణ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సోమవారం కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య, నాయకులు ఎల్లల దశరథ్ రెడ్డి, సున్నం సత్యం,పోతరాజు శివరాజం, ఆసతి పెద్దరాజం, బోనగిరి రాజారెడ్డి బాధ్యత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## నంది మేడారం పెద్దమ్మ తల్లి బోనాల వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి





**చురకలు,విలేఖరి,వెల్గటూర్,జూన్ 29 :** ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో సోమవారం నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్ కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలునిర్వహించారు.రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారో గ్యాలు,సుఖశాంతులు,కలిగి సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండేలా చూడాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణసంస్కృతిసంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించాలి



**చురకలు విలేకరి, రాయికల్,జూన్ 29 :** రాయికల్ పట్టణంలో 2009 – 10 సంవత్సరంలో ఇందిరా నగర్ కాలనీలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయిస్తే గరిపట్టితో మున్సిపల్‌కు ఆదాయం వస్తుందని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆడెపు రాజమౌళి అన్నారు. సోమవారం జగిత్యాల కలెక్టర్ ప్రజావాణిలో ఇందిరనగర్ కాలనీలో సుమారు 70ఏళ్లకు ఇంటి నెంబర్ లేక గరిపట్టి వసూలు చేయడం లేదని మున్సిపల్‌కు ఆదాయం కోల్పోతున్నారని అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్‌కు వినతి పత్రాన్ని అందించారు.ఇంటి నెంబర్లపై రాయికల్ మున్సిపల్ అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# చేనేత కళ గొప్పది.. దాన్ని కాపాడుకోవాలి

**-కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ జూన్ 29 :** చేనేత ఒక వృత్తి కాదని ఒక కళ అని, చేనేత కార్మికులను కూలీలుగా చూడొద్దని, వారు ప్రాచీన కళాకారులని,చేనేత వృత్తిని ఆదుకు నేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ స్థానిక నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం ఆయన రాంపూర్-రంగాపూర్‌లో బాపూజీ చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు.ఇటీవల ఎన్నికైన కొత్త పాలకవర్గాన్ని ఆయన సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తిని పద్మశాలి సామాజిక వర్గం తరతరాలుగా కాపాడుకుంటూ వస్తోందని అన్నారు. చేనేతకు చేయూతనివ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.చేనేత పై ఆధారపడి ఎన్నో కుటుంబాలు నేటికీ జీవిస్తున్నాయని దీన్ని గ్రామీణ కుటీర పరిశ్రమగా గుర్తించాలన్నారు.ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. హుజూరాబాద్ చేనేత సహకార సంఘానికి ఎంతో చరిత్ర ఉందని, దాన్ని నాడు పీవీ నరసింహారావు కూడా సందర్శించారని గుర్తు చేశారు. చేనేత వస్త్రాలకు దుప్పట్లకు ఇప్పటికీ మార్కెట్లో డిమాండ్ ఉందన్నారు.ఈ కార్యక్రమం లో సంఘం అధ్యక్షుడు ముషం వెంకట నారాయణ,ఉపాధ్యక్షుడు జడల వెంకటేశ్వర్లు,కోశాధికారి ముషం రవి, సభ్యులు వెంకటేశ్వర్లు,ప్రభులింగం, సదానందం,శాంతయ్య,బండారి శోభా-సదానందం,పద్మ,జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం,జిల్లా అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబయ్య,యూత్ కాంగ్రెస్ సజ్జు, గ్రామ శాఖల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, రామచంద్రం, నరసింహా రెడ్డి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి మీడియా



**-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల,జూన్ 29 :** ప్రజలకు ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్య క్రమాలను చేరవేయడంలో మీడియా కీలకమైన వారధిగా పనిచేస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమం లో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు 2026-28 సంవత్సరానికి సంబంధించిన నూతన అక్రిడేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్తంభమని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వాస్తవాలను నిష్పక్షపాతంగా ప్రజలకు అందిస్తూ సమాజాభివృద్ధికి జర్నలిస్టులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారి సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. అక్రిడిటేషన్ కార్డులు జర్నలిస్టుల విధి నిర్వహణలో ఎంతో ఉపయోగపడతాయని,బాధ్యతా యుతమైన వార్తలతో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని కోరారు. అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వానికి,ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం లో మీడియావారధిగా నిలుస్తోందన్నారు .జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు అందిస్తున్న సహకారం అభినందనీ యమని పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు వేగంగా,పారదర్శకంగా చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని అన్నారు. జర్నలిస్టులు వాస్తవాలను ధృవీకరించి బాధ్యతాయుతమైన వార్తలను అందించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరఫున మీడియాకు ఎల్లప్పుడూ అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జిల్లా లోని వర్కింగ్‌జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమం లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా పౌర సంబంధాల అధికారి వి.శ్రీధర్,విలేకరులు పాల్గొన్నారు.

# ప్రజల గడపకే సంక్షేమం... ప్రజల సేవే లక్ష్యం..

**-హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**-గ్రామాలకు వెళ్లి సీఎం రిఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ జూన్ 29 :** హుజూరాబాద్ నియోజక వర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తామని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన హుజూరా బాద్ మండలంలోని సిర్సపల్లి, రాజపల్లి, చెల్పూర్, బొత్తలపల్లి, పెద్దపాపయ్యపల్లి, కాట్రపల్లి గ్రామాల్లో లబ్ధిదారుల ఇండ్లకు స్వయంగా వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.అనారోగ్యం ,ప్రమాదాలు వంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సహాయం వారి గడప వద్దకే చేరేలా చేసి,బాధిత కుటుంబాలకు ధైర్యం నింపుతున్నామని అన్నారు.ప్రజలు కష్టాల్లో ఉన్న ప్రతిసందర్భంలో అండగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత గా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. "ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ ఉంటానని,అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరంకృషి చేస్తానని,ప్రజల విశ్వాసమే తనకు బలమని,వారి సేవ చేయడమే తన బాధ్యత అని,సంక్షేమమే తన లక్ష్యం" అని అన్నారు.ప్రజలకు అవసరమైన ప్రతి సమయంలో అండగా నిలుస్తూ, ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రతి ఇంటి గడపకు చేర్చడంలో నిరంతరం కృషి చేస్తున్నా మన్నారు.ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, అభివృద్ధి-సంక్షేమమే ఎజెండాగా ముందుకు సాగుతున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జావెద్, సింగిల్ విండో చైర్మన్ కొండాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి, కే డి సి సి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్, మాజీ ఎంపీపీ వెంకటేష్, గ్రామ సర్పంచ్లు, మాజీ సర్పంచ్లు, బీఆర్ఎస్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

# రాజకీయ కక్షతోనే అట్రాసిటీ కేసు

**-7వవార్డులో డ్రైనేజీ వివాదంలో కౌన్సిలర్ల రాజకీయాలు**




**చురకలు విలేకరి,మెట్‌పల్లి, జూన్ 29 :** రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మెట్ పల్లి పట్టణానికి చెందిన ధ్యావరశెట్టి అరుణకుమార్‌పై ఉద్దేశపూర్వకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు,నాయకులు తీవ్రంగా ఆరో పించారు.సోమవారం మెట్‌పల్లి పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఈ సందర్భంగా స్థానిక 7వ వార్డులో జరిగిన డ్రైనేజీ వివాదం వెనుక ఉన్న అసలు నిజాలను వారు మీడియాకు వివరించారు.

**పాత కక్షలతోనే ఉద్దేశపూర్వక గొడవ..**

బీఆర్ఎస్ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం..మెట్‌పల్లి మున్సి పాలిటీ పరిధిలోని 7వవార్డులో ఇటీవల డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించిన వివాదం చోటుచేసుకుంది.అయితే,ఈ వివాదాన్ని ఆసరాగా చేసుకుని, సంబంధిత వార్డు సభ్యురాలి భర్త తనకున్న పాతకక్షలను మనసులో పెట్టుకుని రాజకీయ డ్రామాకు తెర లేపారని మండిపడ్డారు.ప్లాన్ ప్రకారం ఎస్సీ కులానికి చెందిన వేరే వార్డు కౌన్సిలర్‌ను కావాలనే 7వ వార్డుకు రప్పించారని,అక్కడ ధ్యావరశెట్టి అరుణకుమార్ అనే వ్యక్తితో ఉద్దేశ పూర్వకంగా గొడవ సృష్టించారని ఆరోపించారు.

**చట్టాన్ని అడ్డుపెట్టుకుని అన్యాయంగా కేసుల రాజకీయం..**

కేవలం రాజకీయ లబ్ధి కోసం, కక్ష సాధింపు కోసమే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ అన్యాయంగా కేసు నమోదు చేయించారని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అంగడి పురుషోత్తం,బీఆర్ఎస్ నాయకులు బంగారుకాళ్ళ కిషోర్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు.అసలు సంబంధంలేని వార్డు కౌన్సిలర్‌ను ఇక్కడికి తీసుకురావడమే వారి కుట్రకు నిదర్శనమని పేర్కొన్నారు.

**ఇది ముమ్మాటికీ అన్యాయం..**

రాజకీయ కక్షలతో ఒక వ్యక్తిపై అక్రమంగా అట్రాసిటీ కేసు పెట్టడం దారుణం.ఈ ఘటనను బీఆర్ఎస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. బాధితుడు అరుణకుమార్‌కు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఈ సమావేశంలో వారు భరోసానిచ్చారు. ?ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులు పుదరి సుధాకర్ గౌడ్, ఏనుగుందుల శ్రీనివాస్ గౌడ్, ఎం.డి.జావీద్, వాజీద్, డాకూరి వెంకటేష్ బాధితుడికి తమ పూర్తి మద్దతును ప్రకటించారు.

# రక్తదానం చేసిన రిపోర్టర్

**చురకలు విలేకరి, మెట్‌పల్లి, జూన్ 29 :** మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ప్రజాజ్యోతి డివిజన్ రిపోర్టర్, సామాజిక సేవకుడు ఓంకారి శ్రీనివాస్ అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసి మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని వెంకట అలేఖ్య నర్సింగ్ హోమ్ లో చికిత్స పొందుతున్న స్వప్న అనే మహిళకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. దీంతో రక్తదాత కోసం వెతికిన బాధిత కుటుంబ సభ్యులు రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్ ను సంప్రదించారు. ఈ విషయం తెలుసుకున్న ఉదయ్ కుమార్ వెంటనే ఓంకారి శ్రీనివాస్‌కు సమాచారం అందించగా, ఆయన ఎలాంటి ఆలస్యం చేయకుండా బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు. కాగా, రెండు రోజుల క్రితమే తనది ఓ పాజిటివ్ రక్తగ్రూప్ అని, ఎవరికైనా ఎప్పుడైనా అత్యవసరంగా రక్తం అవసరమైతే తనను సంప్రదించాలని ఉదయ్ కుమార్‌కు శ్రీనివాస్ ముందుగానే



తెలియజేయడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది.అత్యవసర సమయంలో వెంటనే స్పందించి రక్తదానం చేసి బాధితురాలి చికిత్సకు తోడ్పడిన ఓంకారి శ్రీనివాస్‌ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, రోగి కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.